# 'మా విద్విషావహై'

పగలు.. ఒంటిగంట -

వార్తలు మోసుకువచ్చే పొద్దుగాటి కాగితాలు... నురుగులు కక్కుకుంటూ పరుగెత్తుకు వచ్చి... ఎదుట నించున్నాయి.

తెరిచూశాను. కళ్లు భగ్గుమన్నాయి.

అంతే...

అడ్డంగా... నిలువుగా - రెక్కలు తొడుక్కున్న క్రౌర్యంలా - బాకులు - ఎగురుతున్నాయి.

'ధన్... ధన్ - ధనా' తుపాకులు పేలుతున్నాయి.

చుట్టూ తుపాకిమందు - క్రూరవాసన.

ఎగిరిన పాగాలు - ఇరిగిన గొంతుకలు -

చిదిగిన గడ్డాలు - విచ్చిన గుండెలు -

తిరిగే కన్నులు- ఒరిగే దేహాలు -

పాలరంగు పాపల బుగ్గల్లో..

ఏనుగు దంతపువన్నె ఆడుపడుచు - వక్షంలో - బాకులు గుచ్చిన నెత్తురు - బుసబుసలు...

అన్నిటిలోంచీ ఒక్కటే రంగు - నెత్తురు -

దిక్కుమాలిన రక్తానికి - వర్ణభేదం లేదు గాబోలు!!

అరరే - చూశావా?

అన్ని కళేబరాల గాయాలూ... ఒకే ఒక్క ఆఘాతమై - ఆ తల్లి దేహవల్లినించి - ఎట్లా - రక్తపు చారికలుగా దిగజారుతున్నాయో -

అయ్యో - తలమీద బలమైన లాఠీ విరిగింది.

కళ్లల్లో చీకట్లు - అల్లా!

అల్లా చూడు!

•••

మూడువందలేళ్లు - వెనక్కి ఒదిగి ఒదిగి తప్పుకున్నాయి. అద్భుత పరిమళాలు వెదజల్లే - అగరు పొగ -

పచ్చని నల్ల కలువ రేకు రంగు ... సొగసు తీగలుగా సాగి - ధూమకరండకం నుంచి లేచి ప్రాంతభూమిని మత్తులో ముంచుతూన్నది.

ఆ చంద్రశిలా మహారాజప్రసాదంలోకి - నడువు - భయంలేదు.

భారత చక్రవర్తి మహేంద్ర వైభవోపేత సభాభవనంలో - కాలు పెట్టు.

గోడల మీద శిల్పాల్లో నిలిచి రంగురంగు ఈరెండలు కాసే పద్మరాగగోమేధిక మాణిక్యాల వెలుగుకు కళ్లను సర్దుకుని - నెమ్మదిగా ముందుకు కదులు -

వజ్రాల అంచులతో, మరకతాల తరులతాది మధ్య చిత్రాలతో, ధగధగ మెరిసే - విశాల రత్నకంబళం మీద -

తెల్లపట్టు మస్నద్‌ను ఆనుకొని శ్రీ షాజహాన్ చక్రవర్తి -

ప్రక్కగా - చక్రవర్తి ప్రియపుత్రుడు - దారుషుకో - కావ్యకళాప్రియుడు.

చక్రవర్తి... చిటికెనవేలి నీలపు వుంగరం ... చరాలున మెరిసేలా ... సవిలాసంగా ... హుక్కా అందుకొని... రెండు గుక్కలు పీల్చి... సన్నజాజుల కటుగంధధూమలతలను నెమ్మదిగా ఊదుతున్నాడు.

మంత్రి సామంతాదుల... శుష్క రాజనీతి ... ఎగయని శాంతసుభగవాతావరణం.

ఆ విశాల సభా భవనంలో.. మూడవ సభ్యుడు - ఒక మధురశ్రోత్రియమూర్తి -

మేలిమి బంగారపు తీగతో చుట్టిన ... రుద్రాక్షతావళంలోని - వజ్రం... అతని మెడ మీద ... ధగధగ మెరుస్తున్నది.

చల్లని శ్రీరాగంతో... మెల్లగా.. అందుకున్నాడు.....

తదవధి కుశలీ ... పురాణశాస్త్ర స్మృతిశతవేదవిచారజో వివేకః

యదవధి న పదం దధాతి చిత్తే హరిణకిశోర దృశోదృశో ర్విలాసః॥

"అచ్చా... బహుత్ అచ్చా" ఆ కవితా మాధుర్యానికి... కుడ్యరత్న చిత్రాలు... కిలకిలమన్నాయి.

సౌధోపరిభాగంలోని ... గులాబీ మేలిముసుగుల మృదు కంకణ నిక్వాణం ముఖరిత

మైంది.

పాదుషా ... పెదవి వద్దకు తెచ్చిన హుక్కా... ఆపి...

మహాకవీ! జగన్నాథా! పండితరాజా!

మూగవోయిన ఈ రంగురాళ్లు కావు...మా సభాభవనరత్నాలు - మీరూ మా సభా మందిర - దివ్యరత్నం!

తన చేతులతో మహాకవి చేతులను ఆప్యాయంగా అదుకున్నాడు.

తళతళమనే రెండు ఆనందాశ్రువులు - మొగల్ సార్వభౌముని కళ్లల్లో ఎగిసి చెక్కిళ్ల మీదుగా జారాయి.

•••

"ఏ తీరున నను దయజూచెదవో ఇనవంశోత్తమ రామా! నా తరమా- " జైలు గోడలు జాలితో చెమర్చాయి.

అతని విశ్వాసానికి - జైలు తలుపు - ఉక్కు ఖడ్డీలు నిశ్వసించాయి కానీ -

ఆ డబ్బెవరిది? అధికార దుర్వినియోగం -

కాదులే - అంధవిశ్వాసం -

తప్పు - ఆత్మత్యాగం.

నవాబు ధనంతో - కాఫిర్ గుడి గోపురాలు - కదూ?

తహస్సీల్‌దారు తల - ఎగిరిపోతుంది. పాపం -

"ఖోలో - దర్వాజ్ ఖోలో -"

కారాగారపు ఉక్కు తలుపులు - లోభి పిడికిలిలా - బద్ధకంగా తెరుచుకున్నాయి.

"గోపన్నా - భాయీసాబ్?"

"ప్రభూ, ప్రభూ, వచ్చావా? - రామా! నయనాభిరామా! పట్టాభిరామా! దయ చేశావా? ఇప్పటికి"

"గాభరా వద్దు - భాయీ! నన్ను చూడండి - గోల్కొండ - మీమీద వాదులు వినీ - బందీలో వేశాం"

"ప్రభువులు- తల తీయించండి. నా భద్రమూర్తిని - త్వరగా చేరుకుంటాను."

"తొందరవద్దు - తప్పులు చెయ్యడం ఎంత సహజమో, దిద్దుకోవడం అంత సులభం - ఆలుబిడ్డలకోసం - మీ భోగంకోసం - చెయ్యలేదు. నిజం. అల్లా ఆజ్ఞ - మీ చేతి మీదుగా ఖర్చుపడింది. ఫర్వాలేదు,

మీరు కట్టించిన గుడి అందం చూశాను. కాఫిర్ ద్వేషం లేదు. ఖుషీ కలిగింది. ఇక మీకు స్వేచ్ఛ - మీ రాముడిలో అల్లాను - చూస్తాను"

బంధిఖానా - హఠాత్తుగా - భద్రాచల రామాలయం.

శ్రీరామనవమి - గర్భాలయపు గంటలు - అమోఘంగా మోగుతున్నాయి.

చిరునవ్వుతో - వింటూ ఎదుట నిలిచిన గోల్కొండ నవాబు - తానీషా!

●●●

నిషాపురి! అదిగో .. పారశీక సుందరసీమలు...

ఆ ఉద్యానంలో ... విరియబూసిన ... కొమ్మలతో ఊగే గులాబీ పొదల వద్ద ... ఎవరు వారు?

తెల్లని అంగరఖాలో... మెరిసే ... పండు తమలపాకు రంగు... పచ్చని ... శరీరం. పండిన గెడ్డం.

విజ్ఞాన సీమల్లా - విస్తరించిన రెండు నేత్రాలు, లోకాతీత సుందరానుభూతులు - చూపించే రెండు దీపాలు.

ఒక పద్యాల పుస్తకం - ద్రాక్షారసంతో నింపిన రెండు కూజాలు. ఒక నరకం - ఎదుట.

"అచ్ఛా - స్వేచ్ఛాజీవీ!" ప్రక్క కూజా సవరించి - అమృతం వడ్డించే పారశీక మోహిని -

ఆమె చక్కని నేత్రాల నీడలతో ఆ మధువు మరీ మత్తుగా తియ్యగా ఉందా?

సాఖీ!

ఆ మోహిని -

కోటి మొగలిపూల నునుపుతో మెరసే వక్షం అతని మీదకు వంచి - ఇంకొక చషకం మధువు నింపి - అమరమాధురులు ఒలికించే అతని పెదవులకు అందించి -

నవ్వింది.

అతడు - తెల్లని ఆమె నవ్వును -

ఎర్రని మధువును త్రాగి మైకంతో కన్నులు అరమోడ్చి...

"అచ్చరవంటి నెచ్చెలి... రసాంచిత కావ్యము, కెంపు పానకంబు...

ఇచ్చగ ఆమనిం దొరికెనేని - మసీదుల గుళ్లదాస్యమున్ - మెచ్చక - ముక్తులై - సుఖముమీర చరింతురు ... జాగరూకులై.."

....

"భేష్.. భేషక్"

....

ఎవరు వారు ?

పూర్వం,..

నిషాపూరు ఉండి చెరిగిపోయిన చోటు...

ఒక విశాల జీర్ణోద్యానం...

ఏవేవో పర్షియా ముసలిచెట్లు - ఎత్తుగా పెరిగి ముసురుకొనే జ్ఞాపకాల బరువుతో... నెమ్మదిగా ... తలలు కదుపుతున్నాయి.

నల్లని చెట్ల నీడల్లో... బతికినవాడు భరించలేని నిశ్శబ్ద మృత్యుశైతల్యం -

ఎదుటి గోడను ఆనుకొని - ఒక జీర్ణమైన సమాధి -

గాలికి కదిలే ఉన్నత వృక్షాగ్రాలనుంచి - చెట్లను పెనవైచుకున్న తీగల కొనల నుంచి ... ఉండి ఉండి ఆకులూ ... పూలూ... ఆ సమాధి మీద రాలుతున్నాయి.

నలుగురు - ఆధునిక భారతీయ కవులు - స్విన్న వదనాలతో -ఆర్ద్ర నయనాలతో ఆ సమాధి ముందు .. చేతులుమోడ్చి ... నిలుచున్నారు.

ఒక గొంతు.. ఆ మృతనీరవప్రకృతికి - ఊపిరి కల్పిస్తూ, పలికింది -

... ... ...

"ఓయీ ఉమ్రఖయామ! నీవు చని ఎన్నోఏండ్లుపూండ్లాయె!
లేబ్రాయంపుం జెలి సాఖియున్ - ధరణి గర్భంబందు నిద్రించె
గుర్తే యౌపట్టక నీ నిషాపురము ... జీర్ణించెం గదా!
నీదు గోరీయైనన్ సడలున్,
రుబాయి తొకటే... స్మృత్యంకమై నిల్చెడున్."

●●●

ఎక్కడి పారశీక దేశం?

ఎక్కడి భారతీయ సీమలు?

ఏ హృదయానురాగబంధం -

ఇద్దరినీ ... కలిపిందో -

●●●

గ్రామంలో రంజాను పండుగ – బ్రహ్మాండంగా జరుగుతున్నది.

వాడవాడలా ... హిందూ పులులు ... ముసల్మానుల్లో ... ములిగి చెలగి ఆడు తున్నాయి,

పీర్లకు దండం పెట్టుకున్న అమాయకపు పేరంటాళ్లు .,.. పసుపు కుంకాలు, పళ్ళు... మొక్కుబడి చెల్లించి మరలుతున్నారు.

విద్యాలయానికి వెడుతూ .. మసీదు దగ్గరికి వచ్చాను.

రంగుచెమ్లాలు ... ఫెజ్ టోపీలు –

అంగరఖాలు – ముస్లిం యువకులు .. ఉత్సవంగా... ఉత్సాహంగా.. ఎదురు వస్తున్నారు.

మసీదులోంచి – మంచిరకం అగరొత్తుల ... వాసన... గాల్లో కలిసి సుఖంగా ఒస్తోంది.

హఠాత్తుగా – కల్లోలం –

చిటికెలో పెద్ద ధూళి – ధూళిని మించిన కేకలు – అలజడి – అల్లరి. కారణం తెలి యదు.

పదులు – వందలు – దిక్కు తెలియని ధూళిలోకి పరుగెత్తుతున్నారు.

లాఠీల టకటకలతో – చెవులు చిల్లులు పడుతున్నాయి.

అక్రోశాలు – హాహాకారాలు – కోపాలు – శాపాలు – పాగాలు – ఎగిరాయి. టోపీలు... చిదిగాయి.

ధూళితెర ... భయంకర జాతిద్వేషంలా ఆకాశానికి లేచింది.

తలవని తలంపుగా – కల్లోలం మధ్య – నేను.

తెర కవతలనుంచి ఒక జనప్రవాహం – ముందుకు దూకుతున్నది.

మసకలో – దృశ్యాదృశ్య –పరిచిత – ముస్లిం యువకులు – ముగ్గురు

మస్తాన్ –

మహబూబ్ –

రహిమాన్ –

......

చరాలున – ఒక బాకు చేయి – ధూళిని చీల్చుకొని – నా గుండెకు సూటిగా – వచ్చింది.

"మస్తాన్?" కెవ్వున అరిచాను.

ఎదుటి కళ్లలోని ఎరుపు తెల్లబోయింది, గొంతు ఒణికింది.

"మాస్టరు సాబ్!"

"ఇదిగో - గుండె - ఆలోచించకు. నీ చెయ్యి మంచిది"

ఎదిరిని దహించే చిరునవ్వు - "మీరా?" పాపం. తడికళ్లు తుడుచుకుంటున్నాడు.

రెండు లాఠీలు - తలదాకా వెళ్ళి హఠాత్తుగా ఆగాయి.

గట్టిగా నవ్వాను.

"కానీండి"

"నమస్కారం, నమస్కారం"

"పిచ్చివాళ్లు..."

గట్టిగా కౌగిలించుకున్నాను.

"సహనావవతు...
మా విద్విషావహై"

కిలకిల నవ్వారు.

•••

కళ్లు విప్పాను.

భారతపటం నుదుటిమీద...

గాడిన గాయాల్లోంచి..

వేడివేడి నెత్తురు చుక్కలు...

**(1947 మే - భారతి)**